
నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దిన పత్రిక
RNI - TELTEL/2023/87644
సంచిక : 227 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 30-11 -2025 పేజీలు -8 | వెల: రూ. 5.00

**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

వేడిచాయలోన వేసిన బిస్కట్టు
మునిగి మెత్తబడుచు ముక్కలౌను
జీవితమునగూడ చేయుస్నేహమునందు
మితిగనున్నతోన హితము కలుగు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**
తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.



# రేపటి నుంచి పార్లమెంట్

- పది బిల్లుల ఆమోదానికి జాబితా
- పౌర అణు ఇంధన రంగంలో ప్రయివేటు రంగాన్ని ఆహ్వానించే బిల్లు
- చండీగఢ్ అధికార పరిధి బిల్లుపై ఏకమైన పంజాబ్ రాజకీయ పార్టీలు
- వెనక్కి తగ్గిన కేంద్ర ప్రభుత్వం
- నేడు అఖిలపక్ష సమావేశం

**న్యూఢిల్లీ :- నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పార్లమెంటు శీతాకాల సమావేశాలు రేపటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19 వరకు జరిగే ఈ సమావేశాల్లో పది బిల్లులను ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జాబితా చేసింది. మొత్తం 19 రోజులు సాగే ఈ సమావేశాల్లో 15 రోజులు ఉభయసభలు భేటీ కానున్నాయి. సమావేశాలకు ముందు సంప్రదాయంగా నిర్వహించే అఖిలపక్ష సమావేశాన్ని ఆదివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగనుంది. పార్లమెంటు సమావేశాలు సజావుగా జరిగేలా

-మిగతా 2 లో



# అధిష్ఠాన నిర్ణయమే శిరోధార్యం

- ఇక గందరగోళం ఉండదు
- అల్పాహార విందు అనంతరం కర్నాటక సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్

**బెంగళూరు**
కర్నాటకలో ముఖ్యమంత్రి పదవిపై కాంగ్రెస్ రాష్ట్ర అధినాయకత్వంలో కొంతకాలంగా గందరగోళ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో శనివారం నాడు కీలక పరిణామం చోటుచేసుకున్నది. కాంగ్రెస్ అధిష్టానం నుంచి కేసీ వేణుగోపాల్ సూచన మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ శనివారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇరువురు నేతలు కలిసి అల్పాహారం స్వీకరించారు. సిద్ధరామయ్య నివాసంలో జరిగిన ఈ అల్పాహార భేటీతో తమ మధ్య సంబంధాలు బాగానే ఉన్నాయనే విషయాన్ని స్పష్టం చేశారు. అనంతరం ఇరువురు కలిసి మీడియాతో మాట్లాడారు. అధిష్టానం తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. అప్పటి వరకు ఈ విషయంలో ఎలాంటి గందరగోళానికి తావుండదని, ఇక ముందులాగే రాబోయే రోజుల్లోనూ కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.

-మిగతా 2 లో

# మూడు తరాలను ముంచిన కాంగ్రెస్

## ఆనాడు పీసీసీ చీఫ్ ఎక్కడున్నారు?

- తెలంగాణకు శాశ్వత శత్రువు ఆ పార్టీయే
- ఢిల్లీ తోలుబొమ్మలు, గుజరాత్ కీలుబొమ్మలతో ప్రమాదం
- తెలంగాణను కాపాడేది గులాబీ జెండా, కేసీఆర్ గళమే
- దీక్షా దివస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తమ పార్టీ అధినేత కేసీఆర్ 2009లో చేసిన దీక్ష గురించి అడ్డగోలుగా మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ఆనాడు ఆ ఉద్యమంలో ఎక్కడున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మూడు తరాలను ముంచిన కాంగ్రెస్ పార్టీయే తెలంగాణకు శాశ్వత శత్రువు అని ఆయన విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన దీక్షా దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహం, ప్రొఫెసర్ జయశంకర్, అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన

-మిగతా 2 లో






# 9న డ్రోన్‌షో

- మూడు వేల డ్రోన్లతో 'తెలంగాణ ఈజ్ రైజింగ్, కమ్ జాయిన్ ద రైజ్' ఆవిష్కరణ
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముగింపు సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ప్రయత్నం


**హైదరాబాద్ - నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 9న జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మి ట్ ముగింపు సందర్భంగా గిన్నిస్ వరల్డ్ రికార్డు నెలకొల్పేలా డ్రోన్ షో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఒకేసారి మూడు వేల డ్రోన్లతో ఆకాశంలో 'తెలంగాణ ఈస్ రైజింగ్, కమ్. జాయిన్ ద రైజ్' అనే అక్షరాల సమాహారం ఆవిష్క రించేలా డ్రోన్ షో నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు డ్రోన్లతో ఆకాశంలో అత్యంత పొడవైన వాక్యాన్ని ప్రదర్శించిన

-మిగతా 2 లో

## వచ్చే మూడ్రోజులు తేలికపాటి వర్షాలు



2 లో



# కారుణ్య నియామక దరఖాస్తు గడువు ఏడాదే.

- ఆ తర్వాత చేస్తే చెల్లదు: హైకోర్టు

**హైదరాబాద్ :**
కారుణ్య నియామకాలకు ఏడాదిలోగా దరఖాస్తు చేసుకుంటే ఉద్యోగ నియామకానికి అర్హత ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవో 887 ప్రకారం ఏడాదిలోగానే దరఖాస్తు చేసుకోవాలని తెలిపింది. ఏడాది తర్వాత దరఖాస్తు చేసుకుంటే కారుణ్య నియామకానికి ఆదేశాలు ఇవ్వబోమని తీర్పు చెప్పింది. రాష్ట్ర ఉద్యాన వర్సిటీలో పనిచేస్తున్న తన భర్త 2011 ఏప్రిల్ 2న మరణించడంతో కారుణ్య నియామకం కింద తనకు ఉద్యోగం ఇవ్వాలని మహబూబాబాద్‌కు చెందిన కే భాగ్యలక్ష్మి 2013 మార్చిలో దరఖాస్తు చేసుకున్నారు.జీవో నిబంధనలకు వ్యతిరేకంగా ఏడాది తర్వాత చేసుకున్న ఆ దరఖాస్తును విశ్వవిద్యాలయం తిరసరించింది. దీనిపై భాగ్యలక్ష్మి హైకోర్టును ఆశ్రయించడంతో కారుణ్య నియామకం కింద ఆమెకు ఉద్యోగం ఇవ్వాలని 2025లో సింగిల్ జడ్జి తీర్పు చెప్పారు. ఈ తీర్పును సవాలు చేస్తూ వర్సిటీ దాఖలు చేసిన అప్పీలుపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

-మిగతా 2 లో

# ఏపీలో 3 ప్రాంతీయ జోన్లు

- రాష్ట్రాభివృద్ధే లక్ష్యం : సిఎం చంద్రబాబు
- టిడిపి కార్యాలయంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

**అమరావతి :-**
రాష్ట్రంలో మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. టిడిపి కార్యాలయం ఎన్‌టిఆర్ భవన్‌లో శనివారం ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సమయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో చంద్రబాబు కొంతసేపు మాట్లాడారు. అభివృద్ధి ఏ ఒక్క ప్రాంతానికే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకనుగుణంగా రాష్ట్రంలో మూడు ప్రాంతీయ జోన్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాజధాని అమరావతి పరిధిలో ఉన్న సమస్యలను దశలవారీ పరిష్కరిస్తామని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారంలో తొలుత కొంత గ్యాప్ ఉందని, తనతో వారు సమావేశమైన తరువాత

-మిగతా 2 లో



# విద్యుత్ శాఖపై అవగాహన లేదు

- డిప్యూటీ సీఎంవి పొంతన లేని గణాంకాలు
- భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్

**హైదరాబాద్ :- నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విద్యుత్ శాఖపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కనీస అవగాహన లేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రెండేండ్ల నుంచి మంత్రిగా కొనసాగుతున్నా శాఖపై ఆయనకు ఎలాంటి పట్టు రాలేదని ఎద్దేవా చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్టేట్ పవర్ సెక్టార్ శ్వేతపత్రం, క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ–

-మిగతా 2 లో



# తెలంగాణకు తలమానికం కాజీపేట ఆర్ఎంయూ

- వచ్చే ఏడాది నుంచి ఉత్పత్తి ప్రారంభం
- తొలి దశలో రూ.521 కోట్లు
- కాజీపేట రైల్వే డివిజన్‌పై చర్చ లేదు : కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి

**వరంగల్ నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయు) తలమానికంగా నిలుస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం వరంగల్‌కు వచ్చిన మంత్రి కాజీపేట మండలం అయోధ్య పురంలో నిర్మిస్తున్న రైల్వే మ్యానుఫాక్చరింగ్ యూనిట్ పనులను పరిశీలిం చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. 2–3 ఏండ్లలో తెలంగాణ రైల్వే నెట్‌వర్క్ రూపు




-మిగతా 2 లో

# రాష్ట్రావసరాలకే కొత్త విద్యుత్ ప్రాజెక్టులు

## గ్లోబల్ టెండర్ల ద్వారానే బిడ్ల ఖరారు



2 లో

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ విమర్శలు
- విద్యుత్ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన గత సర్కార్
- గ్రిడ్ బేస్ లోడ్ కోసం థర్మల్ విద్యుత్ అనివార్యం
- సోలార్, హైడెల్ విద్యుత్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



# హెలికాప్టర్ల కొనుగోలుకు రూ.7,995 కోట్లు

## నేవీ ఎంహెచ్-60ఆర్‌పై అమెరికాతో భారత్ ఒప్పందం

**న్యూఢిల్లీ :**
భారత నేవీ ఎంహెచ్-60ఆర్ హెలి కాప్టర్ల కొనుగోలు, ఐదేండ్ల పాటు నిర్వహణ కోసం రూ.7,995 కోట్లతో అమెరికా ప్రభుత్వంతో భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఒప్పందం చేసుకున్నది. ఆగస్టు చివరలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై 50 శాతం సుంకాల విధింపు తర్వాత రెండు దేశాల సంబంధాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో..భారత్ ఈ ఒప్పందంపై సంతకం చేసింది. లాక్‌హీడ్ మార్టిన్ కార్పొరేషన్ తయారు చేసిన ఎంహెచ్-60 ఆర్, అత్యాధునిక ఏవియానిక్స్, సెన్సా ర్లతో బహుళ ఆపరేషన్లకు మద్దతు ఇవ్వడానికి

-మిగతా 2 లో

# రేపటి నుంచి పార్లమెంట్

మొదటి తరువాయి

సహకరించాలని కేంద్రం కోరనుంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో కీలకమైన పౌర అణు ఇంధన రంగంలో ప్రయివేటు రంగానికి ఆహ్వానం పలికేందుకు ఉద్దేశించిన 'ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో సహా పది కీలక బిల్లులు సభ ముందుకు రానున్నాయి. చండీగఢ్ కేంద్ర పాలిత ప్రాంతాన్ని రాజ్యాంగంలోని 240వ అధికరణ పరిధిలోకి తెచ్చే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడతామని తొలుత కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పంజాబ్‌లోని అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), ప్రతిపక్ష కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంట్ ముందుకు తెచ్చే ఆలోచనను ఉపసంహరించుకుంది. ఆ బిల్లును ప్రవేశపెట్టే ఆలోచన ఏదీ లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షానే ప్రకటించాల్సి వచ్చింది.

**ప్రతిపక్షాలు లేవనెత్తే అంశాలు**

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో పలు అంశాలను లేవనెత్తేందుకు ప్రతిపక్షాలు కసరత్తు చేస్తున్నాయి. ప్రధానంగా దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్), అదానీ అంశం, ఢిల్లీ పొల్యూషన్ వంటి అంశాలను లేవనెత్తే అవకాశాలున్నాయి. అలాగే హర్యానా, మహారాష్ట్ర, కర్నాటకలలో జరిగిన ఓట్ల చోరీ, ఎన్నికల కమిషన్ తీరుపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధంగా ఉన్నాయి. రైతుల సమస్య, దేశ భద్రత, ఢిల్లీలోని జరిగిన బాంబు దాడి ఘటనపై కేంద్ర వైఫల్యం, నిరుద్యోగం, ధరల పెరుగుదల తదితర అంశాలపై కూడా ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు యోచిస్తున్నాయి.

**పార్లమెంట్ ముందుకు తీసుకురానున్న బిల్లులు ఇవే..**

పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలకమైన బిల్లులలో 'ఆటమిక్ ఎనర్జీ బిల్లు-2025'తో పాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు (ఎస్ఎంసీ)-2025, జాతీయ రహదారుల (సవరణ) బిల్లు, అర్బిట్రేషన్, కాన్సిలియేషన్ (సవరణ) బిల్లు, ఇన్సూరెన్స్ చట్ట (సవరణ) బిల్లు, ఇన్సాల్వెన్సీ, దివాలా కోడ్ (సవరణ) బిల్లు, కార్పొరేట్ చట్ట (సవరణ) బిల్లు, హైయర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా బిల్లు-2025, మణిపూర్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (సవరణ) బిల్లు-2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు-2025 ఉన్నాయి. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా చట్టం-1992, డిపాజిటరీస్ చట్టం-1996, సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (నియంత్రణ) చట్టం-1956లను విలీనం చేసేందుకు 'సెక్యూరిటీస్ మార్కెట్స్ కోడ్ బిల్లు-2025'ను కేంద్రం తీసుకువస్తోంది.

# మూడు తరాలను ముంచిన కాంగ్రెస్

మొదటి తరువాయి

మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆకాంక్షకు వ్యతిరేకంగా ఈ ప్రాంతాన్ని బలవంతంగా ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలి దశ తెలంగాణ ఉద్యమాన్ని అణచివేసి, ఉద్యమకారులను కాల్చి చంపిందని వాపోయారు. ఆ తర్వాత గెలిచిన తెలంగాణ ప్రజా సమితి 11 మంది ఎంపీలను కాంగ్రెస్‌లో కలుపుకుని తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను చంపేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. అనంతరం మలి దశ ఉద్యమంలోనూ తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను నీరుగార్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఎజెండాగా 2004లో బీఆర్ఎస్ (నాడు టీఆర్ఎస్) నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను ఫిరాయింపులకు ప్రోత్సహించిందని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను గుర్తించకుండా నాడు రాష్ట్రంలో, కేంద్రంలో ఉన్న ఆ పార్టీ నిర్లక్ష్యం చేస్తుండటంతో విశ్వాసానికి విశ్వరూపం, మొండి, జగమొండి అయిన కేసీఆర్ 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారని తెలిపారు. దీంతో ఆ ఏడాది డిసెంబర్ 9న నాటి కేంద్ర హోంశాఖ మంత్రి చిదంబరం పార్లమెంటులో తెలంగాణ రాష్ట్ర ప్రక్రియపై ప్రకటన చేశారని వివరించారు. కేసీఆర్ దొంగదీక్ష చేశారంటూ ఏనాడు తెలంగాణ ఉద్యమంలో లేని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్



విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ చేసింది దొంగ దీక్షే అయితే నాడు ఆ దీక్షను విరమించాలంటూ పార్లమెంటు సాక్షిగా కాంగ్రెస్ ప్రభుత్వంలోని హోం మంత్రి చిదంబరం ఎందుకు విజ్ఞప్తి చేశారని ఆయన ప్రశ్నించారు. తొలి దశ ఉద్యమంలో తొలి శత్రువుగా మారిన కాంగ్రెస్ తెలంగాణకు శాశ్వత శత్రువుగా ఉన్నదని చెప్పారు. ఢిల్లీ తోలుబొమ్మలు, గుజరాత్ కీలుబొమ్మలు, ఢిల్లీకి కప్పం కడుతూ సామంతులుగా ఉన్న వారితో ఎప్పటికైనా రాష్ట్రానికి ప్రమాదమని కాంగ్రెస్, బీజేపీలను ఉద్దేశించి ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణను కాపాడేది గులాబీ జెండా, కేసీఆర్ గళమే అని స్పష్టం చేశారు. యువతరం ఏడుతరాల చరిత్ర తెలుసుకోవాలనీ, లేకపోతే విలన్లే హీరోలుగా తప్పుదోవ పట్టిస్తారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి, మళ్లీ పోటీ చేయించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఫిరాయింపులను ప్రోత్సహించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని దుయ్యబట్టారు. ఉద్యమంలో పట్టువిడుపులతో ముందుకు సాగిన కేసీఆర్ చాణక్యం వల్లనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని, ఇందులో భాగంగా ఎన్నో పదవీ త్యాగాలు, ఎన్నో రాజీనామాలు ఉన్నాయని గుర్తుచేశారు. తెలంగాణ సోయి లేని పార్టీలతో ఏనాటికైనా ప్రమాదమే అని హెచ్చరించారు. బీఆర్ఎస్ ఫీనిక్స్ పక్షిలా మళ్లీ తిరిగి లేస్తుందని అన్నారు. ఉద్యమ పార్టీ, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీగా ఏ స్థానంలో ఉన్నా బీఆర్ఎస్ ఎప్పటికీ ప్రజాపక్షమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ, శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, నగర ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖపై అవగాహన లేదు

మొదటి తరువాయి

2025లను భట్టి విడుదల చేశారనీ, కానీ శనివారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో చెప్పిన గణాంకాలకు ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయని తప్పుబట్టారు. తన శాఖకు సంబంధించిన విషయాలపై ఏ మాత్రం అవగాహన లేని డిప్యూటీ సీఎం.. ఇతరులను రాజకీయాలకు పనికి రారంటూ వ్యాఖ్యానిస్తారా? అని ప్రశ్నించారు. కమీషన్లపై ఉన్న శ్రద్ధ పాలసీలపై ఉంటే ఇలాంటి పొరపాట్లు జరగవని ఆయన ఎద్దేవా చేశారు. "స్టేట్ పవర్ సెక్టార్ శ్వేతపత్రం పేజీ నెంబర్ 7లో 2023 డిసెంబర్ ఒకటి నాటికి సోలార్ కెపాసిటీ 6,123 మెగావాట్లు అని, మొత్తం కాంట్రాక్టెడ్ కెపాసిటీ 19,475 అని చెప్పారు. 2025 జనవరి 11న విడుదల చేసిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీ నెం.8లో కరెంట్ ఇన్స్టాల్డ్ కెపాసిటీ 5,415 మెగావాట్లని అన్నారు. అప్ కమింగ్ 2,474 అనీ, మొత్తం 7,889 మెగావాట్లు అని తెలిపారు. 2023లో 6,123 మెగావాట్లు ఉంటే 2025 నాటికి 5,415 మెగావాట్లు ఎలా అయ్యింది? పెరుగుతుందా?తగ్గుతుందా?, శనివారం ఇచ్చిన పీపీటీలో చెప్పిన లెక్కలను సైతం గతంలో ప్రకటించిన పాలసీ, శ్వేతపత్రంతో పోల్చి చూసుకున్నారా?" అని హరీశ్‌రావు డిప్యూటీ సీఎంను ప్రశ్నించారు. "క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ పేజీ నెంబర్ 8లో తెలంగాణ కరెంట్ కాంట్రాక్టెడ్ కెపాసిటీ 26,212 మెగావాట్లు అని పేర్కొన్నారు. అదే పాలసీ పేజీ నెంబర్ 10లో 2029-30 నాటికి 49,104 మెగావాట్లు అని తెలిపారు. 2034-35కు 66,694 మెగావాట్లు అని తేల్చారు.

## తెలంగాణకు తలమానికం కాజీపేట ఆర్ఎంయూ

మొదటి తరువాయి

రేఖలు మారనున్నాయన్నారు. 2023 జులైలో ప్రధాని మోడీ శంకుస్థాపన చేసిన ఈ యూనిట్ పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయన్నారు. మొదటి దశలో రూ.521 కోట్లతో ఈ పనులను రైల్వే వికాస్ నిగం లిమిటెడ్ (ఆర్వీఎన్ఎల్) చేపట్టిందన్నారు. ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని, వచ్చే ఏడాది ఉత్పత్తి ప్రారంభమవుతుందని చెప్పారు. 160 ఎకరాలలో ఈ యూనిట్‌ను నిర్మిస్తున్నా మన్నారు. ఈ ఫ్యాక్టరీని డే లైటింగ్ వుండే విధంగా ఫ్రీ లైటింగ్, ఫ్రీ వెంటిలేషన్‌తో నిర్మించారన్నారు. దీంతో విద్యుత్ ఆదా అవుతుందన్నారు.

**ఇఎంయు, ఎంఇఎంయుల తయారీ**

16 కోచ్‌లతో కూడిన ఇఎంయు, ఎంఇఎంయులను రూపొందించనున్నారని మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే వంద శాతం విద్యుద్ధీకరణ పనులను పూర్తి చేశామన్నారు. ప్రమాదాలను నివారించే 'కవచ్' వంటి రక్షణ వ్యవస్థ మొదటగా మన దక్షిణ మధ్య రైల్వేలోనే అమలు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఏకకాలంలో 40 రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి వంటి మూడు ప్రధాన టర్మినల్స్‌పై రైల్వే శాఖ ప్రధానంగా దృష్టి సారించిందన్నారు. ఆదిలాబాద్-ఆర్మూర్, హైద్రాబాద్-మెదక్, హైదరాబాద్-సిద్దిపేట మార్గాల్లో కొత్త రైల్వే లైన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొమురవెల్లికి నూతన రైల్వే లైన్‌ను నిర్మిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్లు ఇవ్వడానికి వెనుకడుగు వేసినా ఎంఎంటీఎస్ రెండో దశను పూర్తి చేశామని చెప్పారు.

# రాష్ట్రావసరాలకే కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌లు

**గ్లోబల్ టెండర్ల ద్వారానే బిడ్ల ఖరారు**
**అభివృద్ధిని చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ విమర్శలు**
**విద్యుత్ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన గత సర్కార్**
**గ్రిడ్ల బేస్ లోడ్ కోసం థర్మల్ విద్యుత్ అనివార్యం**
**సోలార్, హైడెల్ విద్యుత్ ప్రాజెక్ట్‌లపై ప్రత్యేక దృష్టి**
**ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

హైదరాబాద్



ప్రపంచంతో పోటీ పడుతూ వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ రాష్ట్రావసరాల కోసమే కొత్త విద్యుత్ ప్రాజెక్ట్‌లను ప్రతిపాదించామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి శనివారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఇంధనరంగ అవసరాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రామగుండం, పాల్వంచ, మక్తల్‌లలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లను నిర్మించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడంపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పి కొట్టారు. గ్రిడ్ స్టెబిలిటీ, ప్రజా అవసరాల ను దృష్టిలో పెట్టుకుని కొత్త ప్రాజెక్ట్‌లు చేపట్టామని చెప్పారు. "గ్రిడ్‌ను స్థిరంగా ఉంచటానికి థర్మల్ పవర్ కూడా తప్పనిసరి. పునర్వినియోగం మాత్రమే సరిపోదు. బేస్‌లోడ్ లేకపోతే తెలంగాణ కూడా స్పెయిన్ పోర్చుగల్ అనుభవాలని చవి చూడాల్సి ఉంటుంది. గ్రిడ్ కుప్పకూలితే రాష్ట్రానికి రోజుకు రూ.15 వేల నుంచి రూ.20 వేల కోట్ల నష్టం వాటిల్లుతుంది. ఆస్పత్రులు, రక్షణ, రవాణా, టెలికాం, డేటా సెంటర్లు మొదలగు కీలకరంగాలన్ని తీవ్రంగా దెబ్బతింటాయి. జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా గ్రిడ్‌లను రక్షించడానికి 5 వేల నుంచి 6వేల మెగావాట్ల థర్మల్ సామర్థ్యాన్ని పెంచాలి" అని భట్టి వివరించారు. పదేండ్ల పాలనలో విద్యుత్ రంగాన్ని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాలం చెల్లిన టెక్నాలజీని ఉపయోగించి రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము సబ్ క్రిటికల్ థర్మల్ ప్లాంట్లను వ్యతిరేకించామని గుర్తు చేశారు. అదే క్రమంలో కొత్తగా నిర్మించే ప్లాంట్లను సూపర్ క్రిటికల్ విధానంలో ఏర్పాటు చేస్తున్నామని స్పష్టం చేశారు. పిట్ హెడ్ వద్దనే థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని భట్టి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు గ్లోబల్ టెండర్ల ద్వారా తక్కువ కోట్ చేసిన బిడ్లను ఖరారు చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదని తేల్చి చెప్పారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక, బీఆర్ఎస్ ఆరోపణలు చేస్తున్నదని దుయ్యబట్టారు.

# అధిష్ఠాన నిర్ణయమే శిరోధార్యం

మొదటి తరువాయి

బీజేపీ-జేడీఎస్ దుష్ప్రచారం

కాంగ్రెస్ నాయకత్వంలో ఏదో జరిగిపోతోందన్నట్లుగా బీజేపీ, జేడీఎస్ దుష్ప్రచారం చేస్తున్నాయని సిద్ధరామయ్య పేర్కొన్నారు. తనకు, డీకే శివకుమార్‌కు మధ్య గతంలో ఎలాంటి భేదాభిప్రాయాలు లేవని.. ఇకముందు కూడా ఉండబోవని తెలిపారు. కేసీ వేణుగోపాల్ సూచన మేరకు జరిగిన అల్పాహార భేటీ కేవలం గందరగోళానికి తెర దించడానికి మాత్రమే జరిగిందని, ఇందులో ఏ విషయంపైనా చర్చించలేదని ఆయన చెప్పారు. ప్రస్తుతం తమ పార్టీ 2028 ఎన్నికలు, స్థానిక ఎన్నికల పైనే ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిపారు. 2028లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

వేచివుండడానికి సిద్ధమే : శివకుమార్

నాయకత్వం విషయంలో అధిష్టానమే నిర్ణయమే శిరోధార్యమని శివకుమార్ పునరుద్ఘాటించారు. ఇంతకాలం తనను పార్టీ పెద్దలు వేచి ఉండాలని సూచించడంతో తాను ఎదురుచూస్తున్నానని, అయితే ఇంకొంతకాలం కూడా వేచి ఉండడానికి తాను సిద్ధమేనని తెలిపారు. తాము పార్టీకి విశ్వసపాత్రులైన సైనికుల్లా పని చేస్తున్నామన్నారు. ప్రస్తుతం పార్టీ పలు సమస్యలు ఎదుర్కొంటోందని.. 2028లో రానున్న కర్నాటక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఆయన తెలిపారు. కాగా ఈ సమావేశం అనంతరం డీకే శివకుమార్ ఢిల్లీకి వెళ్లారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతోనూ, పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేతోనూ ఆయన సమావేశం కానున్నట్లు శివకుమార్ సన్నిహితులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లోనూ ఇరువురు నేతలు ఆసక్తికర రీతిలో పోస్టులు పెట్టారు. ' ఈ రోజు డీకే శివకుమార్‌తో కలిసి అల్పాహారం స్వీకరించాం. కొంత సేపు కలిసి మాట్లాడుకున్నాం' అని సిద్ధరామయ్య పోస్టు చేయగా.. 'రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక ఫలప్రదమైన చర్చ జరిగింది' అని శివకుమార్ తెలిపారు.

# 9న డ్రోన్‌షో

మొదటి తరువాయి

రికార్డు యునైటెడ్ అరబ్ ఎమిరెట్స్ అబుదాబీ పేరిట ఉంది. 2025 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా 2,131 డ్రోన్లతో 'హ్యాపీ న్యూఇయర్' అనే వాక్యాన్ని ప్రదర్శించి ఈ రికార్డును అందుకుంది. అంతకు మించిన సంఖ్యలో డ్రోన్లను ఉపయోగించి గ్లోబల్ సమ్మిట్ ముగింపు వేడుకల్లో అద్భుతమైన డ్రోన్ షో నిర్వహించ నుంది. డ్రోన్‌షోతో తెలంగాణ రైజింగ్ నినాదాన్ని గగనతలంలో ప్రదర్శించి ప్రపంచ రికార్డు అధిగమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

## కారుణ్య నియామక దరఖాస్తు గడువు ఏడాదే.

మొదటి తరువాయి

జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులు జీవో 887కి వ్యతిరేకంగా ఉన్నట్టు తేల్చింది. భర్త మరణించిన ఏడాదిలోగానే కారుణ్య నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని, లేనిపక్షంలో కారుణ్య నియామకానికి అనర్హులని తీర్పు చెప్పింది.

## వచ్చే మూడ్రోజులు తేలికపాటి వర్షాలు

హైదరాబాద్,



నైరుతి బంగాళాఖాతంలో దిత్వా తుఫాన్ కారణంగా రానున్న మూడ్రోజులు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే 48గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం పడే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది.సోమవారం ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, నాగర్‌కర్నూలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది.

## హెలికాప్టర్ల కొనుగోలుకు రూ.7,995 కోట్లు

మొదటి తరువాయి

రూపొందించ బడినదిగా అధికారులు తెలిపారు. ఈ హెలికాప్టర్ ఎలాంటి వాతావరణాన్నైనా తట్టుకోగల సామర్థ్యం కలిగి ఉన్నదని వివరించారు.రక్షణమంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం.. సస్టైన్‌మెంట్ సపోర్ట్ అనేది ఒక సమగ్ర ప్యాకేజీ అని, ఇందులో విడిభాగాలు, సహాయక పరికరాలు, ఉత్పత్తి మద్దతు, శిక్షణ, సాంకేతిక సహకారం , భాగాల మరమ్మతు, నిర్వహణ అంశాలు ఉన్నాయని పేర్కొన్నది. ఇది దేశంలోని ఛాపర్‌ల కోసం ఇంటర్మీడియట్-స్థాయి కాంపోనెంట్ మరమ్మతులు, ఆవర్తన నిర్వహణ తనిఖీ సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి కూడా సహకరిస్తుందని అధికారులు చెబుతున్నారు. మొదటి మూడు ఎంహెచ్-60ఆర్ హెలికాప్టర్లు 2021లో భారతదేశానికి డెలివరీ అయ్యాయని, మిగతా వాటికి ట్రంప్ టారిఫ్‌ల అనంతరం భారత్ తాజా ఒప్పందం చేసుకున్నది.

# ఏపీలో 3 ప్రాంతీయ జోన్లు

మొదటి తరువాయి

అన్నింటిపైనా స్పష్టత వచ్చిందన్నారు. రెండో దశ భూ సమీకరణ వల్ల రైతులకే ఉపయోగమని, ఈ అంశాన్ని వారికి వివరించానని తెలిపారు. అమరావతి మున్సిపాల్టీగా మిగిలిపోకుండా మహానగరంగా అభివృద్ధి చెందితే ఎలాంటి ఫలితాలు ఉంటాయో రైతులు అర్థం చేసుకున్నారని తెలిపారు. రైతులు కోరిన క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు అంశాన్ని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరించానని తెలిపారు. దీనిపై కేంద్రం చర్చించి నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం నియమించిన త్రిసభ్య కమిటీ నిరంతరం వారితో సంప్రదింపులు జరుపుతోందన్నారు. రాజధాని రైతులంతా అమరావతి ప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కింద అంతా ఒకే జెఎసిగా ఏర్పడితే వారితో సంప్రదిస్తూ అన్ని సమస్యలూ పరిష్కరిస్తామన్నారు. రాజధాని చుట్టుపక్కల ప్రాంతాల్లో లేఅవుట్లకు అనుమతుల సమస్యను త్వరలోనే పరిష్కారం చేస్తానని తెలిపారు. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఎ) అధికారులు, సిబ్బందిపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూములు త్యాగాలు చేసిన రైతుల సమస్యలు పరిష్కరించకుండా లంచం డిమాండ్ చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాల నాటికి పూర్తిచేసే దిశగా కృషి చేస్తున్నామని చెప్పారు.

# జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి: పెద్దపల్లిలో ధర్నా



**పెద్దపల్లి, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయుడబ్ల్యూజె ఐజెయు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం పెద్దపల్లి బస్టాండ్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాదులో జరగనున్న మహా ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. జర్నలిస్టులకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 3న మాసాబ్ ట్యాంక్ రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయం వద్ద జరగనున్న మహా ధర్నాకు జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల కమిటీల నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర సంపత్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వంశీ విధ్యానంద్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు అశోక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోల లక్ష్మణ్ గౌడ్, టికె శ్రీనివాస్, రాష్ట్ర మఫిషియల్ కమిటీ సభ్యులు సామల హరికృష్ణ తదితరులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెక్ డ్యామ్ ధ్వంసంపై విచారణ జరపాలి: బీజేపీ



**పెద్దపల్లి, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
మానేరు నదిపై రూ.24 కోట్లతో నిర్మించిన గుంపుల –శంభునిపల్లి చెక్ డ్యామ్ ధ్వంసం కావడంపై రాజకీయ ఆరోపణలు మానుకోవాలని, దీనిపై సిట్టింగ్ జడ్జ్‌తో విచారణ జరపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో ప్రారంభమైన ప్రకృతి వనరుల విధ్వంసం, ఇసుక దోపిడీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ కొనసాగుతోందని ఆరోపించారు. నవంబర్ 22న ఇరిగేషన్ శాఖ రూ.3 కోట్ల ఆస్తి నష్టంపై ఫిర్యాదు చేసిందని, నవంబర్ 23న తీసిన ఫోటోలలో జిలెటిన్ స్టిక్స్ పెట్టి పేల్చినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. చెక్ డ్యామ్ కూలడానికి పేలుడే కారణమా లేక నాణ్యతా లోపమా అనేదానిపై నిపుణుల కమిటీతో విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. చెక్ డ్యామ్ ధ్వంసం వల్ల వాగులో నీరు లేకుండా పోయి, భూగర్భ జలాలు పడిపోయాయని, రైతులు రబీ పంటకు నీటి భద్రతపై ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కూలిపోయిన చెక్ డ్యామ్‌లను పునర్నిర్మించి, వాటి నిర్వహణకు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్నామని తెలిపారు.

# దీక్ష దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి

**పెద్దపల్లి నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా పార్టీ భవన్‌లో దీక్ష దివాస్ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు దాసరి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరికంటి చందర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు హాజరయ్యారు. నాయకులు ముందుగా తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు సమర్పించి, తెలుగు తల్లి విగ్రహానికి నివాళులు అర్పించారు. అనంతరం పార్టీ భవన్‌లో దీక్ష దివాస్ కార్యక్రమాన్ని ప్రారంభించి, కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ దీక్షా దివాస్ తెలంగాణ చరిత్రలో మహోన్నత దినమని, కేసీఆర్ దీక్షతోనే ఉద్యమానికి నాంది పలికిందని, ఆయన పోరాట ఫలితంగానే రాష్ట్రం సాకారమైందని పేర్కొన్నారు. రైతుల కోసం రైతు బంధు, రైతు భీమా వంటి పథకాలు అమలు చేసి తెలంగాణను దేశంలో నెంబర్ వన్‌గా నిలిపారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన



**హుస్నాబాద్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
డిసెంబర్ 3న హుస్నాబాద్ పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. అక్కన్నపేట రోడ్డులో బహిరంగ సభ స్థలాన్ని స్థానిక నాయకులతో కలిసి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. సభకు భద్రత, మౌలిక సదుపాయాలు, పార్కింగ్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రజాపాలన ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. విద్య, వైద్యం, పారిశ్రామికీకరణ, ఉపాధి అవకాశాలు, ఇరిగేషన్ రంగాల్లో అభివృద్ధి చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమానికి కేబినెట్ మంత్రులు కూడా హాజరుకానున్నారు. ప్రజలంతా సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


# ఫలించిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పోరాటం






**పెద్దపల్లి నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దాదాపు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రామగుండం –మణుగూరు కొత్త రైల్వే లైన్ నిర్మాణానికి కేంద్ర రైల్వే శాఖ సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్ట్ సాధనలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పోరాటం ఫలించిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుమారు నాలుగు వేల కోట్ల వ్యయంతో నిర్మించబోయే ఈ రైల్వే మార్గం సింగరేణి కార్మికులు, ప్రాంతీయ ప్రజలు, బొగ్గు రవాణాకు ఉపయోగపడటమే కాకుండా ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరుస్తుంది. సమ్మక్క సారక్క జాతరకు వెళ్ళే భక్తులకు ప్రత్యేక కనెక్టివిటీ లభించనుంది. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంలో భాగంగానే ఈ ప్రాజెక్ట్‌పై దృష్టి పెట్టానని ఎంపీ వంశీకృష్ణ తెలిపారు. రైల్వే లైన్స్, రోడ్లు, ఎన్ హెచ్–63 అభివృద్ధి తమ ప్రధాన అజెండా అని పేర్కొన్నారు.

# 998 సర్వే నంబర్ కోహెడ డంపింగ్ యార్డ్ మార్పు పై వినతిపత్రం



**హుస్నాబాద్ ,నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెంకటేశ్వరపల్లి గ్రామానికి కోహెడ డంపింగ్ యార్డ్‌ను మార్చే నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ సామాజిక కార్యకర్త, గ్రామస్థుడు పిడిశెట్టి రాజు హుస్నాబాద్ ఆర్‌డీవో రాంమూర్తికి వినతిపత్రం సమర్పించారు. అక్కడ మార్కెట్ కమిటీ కార్యాలయం, గోదాం, మిషన్ భాగీరథ వాటర్ స్టోరేజ్ సంపు, పెద్దమ్మ తల్లి దేవాలయం, చేపల చెరువు, వ్యవసాయ కూలీలు, రైతులు, అధికారులు, ప్రజలు తిరిగే ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేస్తే తీవ్ర సమస్యలు తలెత్తుతాయని ఆయన పేర్కొన్నారు. కాలుష్యం, దుర్వాసనతో పాటు వ్యాధులు వ్యాప్తి చేసే ప్రమాదం ఉందని, ఇది ప్రజల ప్రాణాలకు ముప్పు అవుతుందని హెచ్చరించారు. వెంకటేశ్వరపల్లి గ్రామస్థుల తరఫున ఈ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని పిడిశెట్టి రాజు విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



**హుస్నాబాద్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, చలి తీవ్రంగా ఉన్నందున ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు, దోమతెరలు అందించి ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ కోసం నిరంతర కృషి చేస్తున్నామని తెలిపారు. విద్య ద్వారానే చిన్నారులు ఉన్నత స్థాయికి ఎదగగలరని, ఆడపిల్లలు సమాజానికి మణిహారమని పేర్కొన్నారు. ఆడపిల్లలు పుట్టాలి, చదవాలి, ఎదగాలి అని పిలుపునిచ్చారు. బాలికల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం, రాష్ట్ర ప్రభుత్వం 'షీ టీం' పథకాలు ప్రారంభించాయని గుర్తుచేశారు. బాలికలు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. బాలలతో పనులు చేయిస్తే వెంటనే 1098కి సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల ప్రజా వేదిక సలహాదారులు గిటార్ రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీకి 35 కోట్లు



**హుస్నాబాద్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రారంభమైన శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీకి నూతన భవనాల నిర్మాణం, క్యాంపస్ అభివృద్ధి కోసం ప్రభుత్వం 35 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సంవత్సరం నుంచే ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభమైన నేపథ్యంలో తాత్కాలిక మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో నిధులు విడుదల కావడం విద్యార్థుల్లో ఆనందాన్ని కలిగించింది. యూనివర్సిటీ విద్యార్థులు ఈ నిర్ణయాన్ని హర్షిస్తూ, త్వరలోనే శాశ్వత భవనాలు, సదుపాయాలు అందుబాటులోకి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రైస్ మిల్లు తనిఖీ చేసిన డీఎస్‌ఓ కాశి విశ్వనాధ్

**పెబ్బేరు, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెబ్బేరు పట్టణంలోని శ్రీనివాస ట్రేడర్స్ రైస్ మిల్ ని వనపర్తి జిల్లా సివిల్ సప్లై అధికారి కాశీ విశ్వనాథ్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. శ్రీనివాస ట్రేడర్స్ రైస్ మిల్ నుండి ప్రభుత్వానికి 2022–23 సంవత్సరానికి సంబంధించి 38 ఏసీకే



(కస్టమ్ మిల్లుడు రైస్) లు కేటాయించగా ఇంకా 11 ఏసీకే లు ప్రభుత్వానికి బ్యాలెన్స్ ఉండడంతో మిల్లులో నిల్వలు తనిఖీ చేయడంతో కొన్ని బస్తాల ధాన్యం తక్కువగా ఉన్నట్లు డీఎస్ఓ గుర్తించారు. ఈ విషయమై పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డిఎస్ఓ తెలిపారు. పై అధికారుల సూచన మేరకు తగు చర్యలు ఉంటాయని మీడియాకు తెలిపారు.

# జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, సాయి సమీక్ష సమావేశం






**సిద్దిపేట, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధ్యక్షతన ఐడీఓసి సమావేశ మందిరంలో జిల్లా కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం జరిగింది. 2025–26 ఆర్థిక సంవత్సరం ప్రగతి, సబ్సిడీలు, రుణాలు తదితర అంశాలపై బ్యాంకర్లకు సూచనలు చేశారు. సెప్టెంబర్ 2025 నాటికి జిల్లాలో 167 బ్యాంకుల పరిధిలో డిపాజిట్ రూ.5835.37 కోట్లు, అడ్వాన్స్ రూ.11728.5 కోట్లు, మొత్తం వ్యాపారం రూ.17563.87 కోట్లు సాధించామని అధికారులు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ పంట రుణాల ప్రగతిని మెరుగుపరచాలని, మహిళా సంఘాలకు పెండింగ్ రుణాలను క్లియర్ చేయాలని సూచించారు. హుస్నాబాద్ మహిళా సంఘాలకు నాబార్డ్ ద్వారా రుణాలు అందించి శిక్షణతో వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని అన్నారు. రబి సీజన్‌లో రైతులకు అండగా ఉండాలని, బ్యాంకుల పనితీరును ఆన్‌లైన్‌లో నమోదు చేసి వెనుకబడిన బ్యాంకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, ఎల్డిఓ హరిబాబు, యూపిఐ ఆర్‌హెచ్ శ్రీనివాస్, రిజర్వ్ బ్యాంక్ ఏజిఎం రెహమాన్, నాబార్డ్ డి.డి.ఎం నికిల్, టిజిబి ఆర్ఎం ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల పరిశీలన వర్గల్ మండలంలోని గౌరారం క్లస్టర్, గజ్వేల్ మండలంలోని రీమ్మనుగూడ క్లస్టర్‌లో నామినేషన్ ప్రక్రియను జిల్లా గ్రామపంచాయతీ ఎన్నికల సాధారణ పరిశీలకులు కె. హరిత ఐఏఎస్ పరిశీలించారు. గౌరారం, సింగయిపల్లి, చౌదరిపల్లి, చాంద్ కాన్ మక్తా, అవుసులోపల్లి గ్రామాలు, అలాగే రీమ్మనుగూడ, బూరుగుపల్లి, కొడకండ్ల గ్రామాల్లో నామినేషన్లు స్వీకరించబడుతున్నాయని సిబ్బంది వివరించారు. స్టేట్ ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సౌకర్యాలు, అర్ఓ పనితీరును పరిశీలించిన పరిశీలకులు, ఎన్నికలకు సంబంధించి ఎలాంటి పిర్యాదులు ఉంటే 6305956344 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ రియాజ్ కు సన్మానం



**హుస్నాబాద్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర గ్రంధాలయ చైర్మన్ రియాజ్‌ను ప్రముఖ సంఘ సేవకుడు, బాలల హక్కుల ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాలు విజ్ఞాన కేంద్రాలని, పాఠకులు విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా మేధాశక్తి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లింకన్ దినేష్ సంస్థ సభ్యులు సహా పలువురు పాల్గొన్నారు.
.

# హుజురాబాద్ మండల విద్యాధికారి పై ఆర్‌జెడికి ఫిర్యాదు



**హుజురాబాద్ నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుజురాబాద్ మండల విద్యాధికారి తన కార్యాలయ అవసరాల కోసం ప్రభుత్వ ఉపాధ్యాయుడిని డిప్యూటేషన్ పేరిట ఎంఈఓ కార్యాలయంలో విధులు చేయిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధించకుండా జీతం పొందుతున్నారని ఆరోపిస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ బ్లాక్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సభ్యుడు కొలుగూరి సూర్యకిరణ్ వరంగల్ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు సత్యనారాయణ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు విద్యార్థులకు బోధన చేయకుండా కార్యాలయ పనుల్లో టైంపాస్ చేయడం తీవ్ర అన్యాయం అని, ఇది అధికార దుర్వినియోగం కిందకు వస్తుందని మండిపడ్డారు. పాఠశాలకు రావాల్సిన ఉపాధ్యాయుడు రాకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని, జీతభత్యాలు పొందడం అన్యాయం అని పేర్కొన్నారు. ఆర్‌జెడి స్పందిస్తూ విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంఈఓ, ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకునేంత వరకు పోరాటం కొనసాగిస్తానని సూర్యకిరణ్ తెలిపారు.

# బెల్టు షాపు నడుపుతున్న వ్యక్తుల బైండోవర్



**కరీంనగర్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బెల్టు షాపులు నడుపుతున్నవారు, క్రితం ఎన్నికల్లో కేసులు నమోదైనవారు, రౌడీ షీటర్లపై చర్యలు తీసుకున్నారు. మొత్తం 7 కేసుల్లో 28 మందిని కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టి, ఒక్కొక్కరికి లక్ష రూపాయల పూచీకతుపై బైండోవర్ చేశారు. కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ ఇకపై ఎవరైనా బెల్టు షాపులు నడిపితే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. ఎన్నికల కాలంలో గ్రామాల్లో ఎలాంటి అలజడులు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎలక్షన్ కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించినా కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించండి



**చొప్పదండి, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరుస్తున్న అభ్యర్థులను సర్పంచ్‌లు, వార్డు సభ్యులుగా ఎన్నుకొని గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి విజ్ఞప్తి చేశారు. చొప్పదండిలో బీజేపీ నాయకులతో సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ 2014 నుంచి మోడీ ప్రభుత్వం గ్రామాలకు విస్తృతంగా నిధులు అందజేస్తోందని, గ్రామపంచాయతీ కార్యాలయాలు, స్మశాన వాటికలు, రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు కేంద్ర నిధులతో మంజూరయ్యాయని తెలిపారు. వీధిలైట్లు, సీసీ రోడ్లు, పశువుల టీకాలు, కోవిడ్ టీకాలు కేంద్రం ద్వారానే అందాయని గుర్తు చేశారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఉపాధి హామీ నిధుల ద్వారా సీసీ రోడ్లు, డ్రైనేజీలు మంజూరు చేయించారని, విద్యార్థులకు సైకిల్, పరీక్ష ఫీజులు చెల్లించారని, ఆరోగ్య కేంద్రాలకు సి.ఎస్.ఆర్ నిధులతో పరికరాలు అందించారని వివరించారు. స్థానిక సర్పంచ్‌గా బీజేపీ నాయకులు ఉంటే పార్లమెంట్ సభ్యులతో అనుసంధానంగా మరిన్ని నిధులు తెచ్చి ప్రజలకు సేవలు అందించగలరని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల లక్ష్మీనారాయణ, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, కొలగాని శ్రీనివాస్, మొగిలి మహేష్, మొగిలి సారయ్య, భూమిరెడ్డి, కిట్టు గౌడ్, జగన్మోహన్ రెడ్డి, రాపెల్లి శ్రీనివాస్, మంచి కట్ల మల్లేష్, కాయిత సాయి రాజేందర్, జొంగోని తిరుపతి గౌడ్, జక్కుల అంజయ్య, శంకర్, దయ్యాల శేఖర్, చీకట్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

**కరీంనగర్ రూరల్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు దుర్శేడ్ గ్రామ బస్టాప్ వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన కొత్తూరి కొమురయ్య అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి ఇసుకను ట్రాక్టర్‌లో కరీంనగర్ వైపు తరలిస్తుండగా పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసి కోర్టుకు పంపనున్నట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఇకపై అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బీఆర్ఎస్ పార్టీలో చేరిన కాంగ్రెస్ నాయకులు



**హుస్నాబాద్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అక్కన్నపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ కమిటీ డైరెక్టర్ పొడిచెట్టి లలిత, వెంకన్న రాజు, రణధీర్ బీ ఆర్ ఎస్ పార్టీలో చేరారు. సర్పంచ్ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సాధించబడిందని, అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆధ్వర్యంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని, ఏ ఎన్నిక వచ్చినా బీ ఆర్ ఎస్ పార్టీ విజయం కోసం కృషి చేస్తామని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు పెసర సాంబరాజు, మాజీ జెడ్పిటిసి బీ లు నాయక్, మాజీ జెడ్పిటిసి భూక్య మంగా, శ్రీనివాస్, ప్రభాకర్ రెడ్డి గులాబీ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండల మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం తాత్కాలిక రద్దు



**నల్లగొండ, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా డిసెంబర్ 17 వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడదని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రకటించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజావాణి కార్యక్రమం ఎన్నికల కోడ్ కారణంగా తాత్కాలికంగా రద్దు చేయబడిందని ఆమె తెలిపారు. ఈ కాలంలో ప్రజలు ఫిర్యాదులు సమర్పించేందుకు కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

# మాజీ మేయర్ సునీల్ రావు సుడిగాలి పర్యటన హుజురాబాద్



**హుజురాబాద్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో వీణవంక మండలంలోని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని మాజీ మేయర్ సునీల్ రావు విజ్ఞప్తి చేశారు. వీణవంక ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని, అభివృద్ధి పనులు కేంద్రం నుంచి వచ్చిన నిధుల ద్వారానే జరిగాయని అన్నారు. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన, 15వ ఆర్థిక సంఘం నిధులు, నరేగా ఫండ్స్ ద్వారా గ్రామాల్లో రహదారులు, డ్రైనేజ్, శానిటేషన్ వంటి పనులు జరిగాయని వివరించారు. బండి సంజయ్ నాయకత్వంలో కరీంనగర్ జిల్లాలో రోడ్లు, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు, ఆసుపత్రులకు సి.ఎస్.ఆర్ ఫండ్స్ ద్వారా పరికరాలు అందించారని గుర్తుచేశారు. గ్రామాల్లో అభివృద్ధి చేయగలిగేది కేంద్రం మాత్రమేనని, బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే మరింత నిధులు వస్తాయని సునీల్ రావు అన్నారు. వీణవంక మండలంలోని 26 గ్రామపంచాయతీలతో పాటు హుజురాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేష్, జిల్లా కార్యదర్శి పుప్పాల రఘు, నరసింహారావు, పండుగ నాగరాజు, అనిల్ తదితర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా దీక్షా దివాస్





**కుత్బుల్లాపూర్, నవంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి గండి మైసమ్మలోని మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో "దీక్షా దివాస్" కార్యక్రమం ఘనంగా జరిగింది. జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ తో పాటు ఎమ్మెల్సీ నవీన్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి, పార్లమెంట్ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్ పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధకులు, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అడుగడుగున అవమానాలు, వివక్షతకు గురైన ఈ ప్రాంతం ప్రత్యేక రాష్ట్ర సాధన ద్వారా ఆవిర్భవించిన తెలంగాణను పదేళ్లలో దేశంలోనే అగ్రపథాన నిలిపిన దార్శనికుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం తమ పదవులను తృణప్రాయంగా వదిలేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని, ఆయన పోరాట పంథాను నేటి యువతకు తెలియజేయడం అవసరమని అన్నారు. రానున్న తెలంగాణ సార్వత్రిక ఎన్నికల్లో కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడం వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త దీక్షతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నేతలు



**ఇల్లంతకుంట, నవంబర్ 29(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇల్లంతకుంట మండలం పత్తికుంటపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్‌లో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ కండువాలు కప్పుకున్న వారిలో జుట్టు భాస్కర్, జుట్టు శేఖర్, మధు, నరేష్, సింగిరెడ్డి మనోహర్ రెడ్డి, బట్టు లక్ష్మణ్, నవీన్, అశోక్, ఓరుగంటి రవి, రాజు, వినోద్, పర్శరాములు, జేరిపోతుల అభిలాష్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరిన వారంతా పార్టీ శ్రేణులతో కలిసిమెలిసి పని చేయాలని కోరారు. ముఖ్యంగా గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతల గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలను ఆషామాషీగా తీసుకోవద్దని, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలంటే పంచాయతీలను కైవసం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి, మండల పరిషత్ మాజీ అధ్యక్షులు ఉట్కూరి వెంకట రమణారెడ్డి, గుడిసె అయిలయ్య యాదవ్, పత్తికుంటపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు బి.తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు ఎల్క రామస్వామి, నగేష్, జి.నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ,పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ పొందే విద్యార్థుల సంఖ్య పెంచాలి

## కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ,నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
జిల్లాలో ప్రీ, పోస్ట్ మెట్రిక్ స్కాలర్షిప్ లు పొందే విద్యార్థుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని, ఇందుకుగాను తక్షణమే ఎంఈఓ లు హెడ్మాస్టర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని, హెడ్మాస్టర్లు తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి స్కాలర్షిప్ ల విషయాన్ని తెలియజేసి స్కాలర్షిప్ పొందేందుకు అవసరమైన ఆధార్ ,బ్యాంకు ఖాతా, కులము, ఆదాయ ధ్రువపత్రాలు వంటివి సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. స్కాలర్షిప్ ల మంజూరు విషయంలో బ్యాంకు ఖాతా ప్రారంభించేందుకు బ్యాంక్ అధికారులతో మాట్లాడాలని, అదేవిధంగా కులము, ఆదాయ ధ్రువపత్రాల జారీ విషయంలో తహసిల్దార్ తో మాట్లాడిన తర్వాత సమస్య ఉంటే నేరుగా రెవెన్యూ అదనపు కలెక్టర్ కు తెలియజేయాలన్నారు. ఎంఈవోలు ఒక చెక్ లిస్టు ను తయారు చేసుకొని చెక్ లిస్ట్ ప్రకారం అన్ని ధ్రువపత్రాలు, ఫోటోతో సహా ఆన్లైన్ చేయాలని, స్కాలర్షిప్ లు పొందడం విద్యార్థుల హక్కు అని అన్నారు. స్కాలర్షిప్ ల విషయమై మండల విద్యాశాఖ అధికారులు తక్షణమే హెడ్మాస్టర్లతో సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. వారం రోజుల్లో ఉపకార వేతనాల దరఖాస్తుల అప్లోడింగ్ లో పురోగతి కనిపించాలని ఆమె ఎంఈఓ లను ఆదేశించారు. స్కాలర్షిప్ ల పై ప్రతిరోజు తనకు నివేదిక సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతిని ఆదేశించారు. ఎంఈఓ లు స్కాలర్షిప్ ల పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు. గ్రామాలలో బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేయాలని చెప్పారు. మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ క్వార్టర్ లోనే ఉండాలని ఆదేశించారు. ఎంఈఓల సమావేశానికి ఆలస్యంగా వచ్చిన ఎంఈఓ లకు సోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు.

# సిఐటియు నాయకులు బ్రహ్మయ్య మృతి





**యాచారం,నవంబర్ 29( నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సిపిఎం పార్టీ యాచారం మండల కార్యవర్గ సభ్యుడు బ్రహ్మయ్య శనివారం సాయంత్రం నాలుగు గంటలకు హఠాత్ మరణం చెందారు . సమాచారం తెలుసుకున్న సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి సామెన్, రామచందర్, చంద్రమోహన్, జగదీష్, జగన్, యాచారం సిపిఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యుడు పి అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఎస్ చందు నాయక్, అలంపల్లి జంగయ్య, మండల్ కమిటీ సభ్యుడు పి వెంకటయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభం



**పెద్దపల్లి, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సుల్తానాబాద్ శాస్త్రి నగర్ అయ్యప్ప ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ప్రారంభించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ సాయిరి మహేందర్ -పద్మ దంపతులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని, అనంతరం అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో మొక్కలు నాటి, పదహారేళ్లుగా అయ్యప్ప దీక్షపరులకు అన్నదానం నిర్వహిస్తున్న ట్రస్ట్ సేవలను అభినందించారు. ఆలయ అభివృద్ధికి తన సహకారం కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు రమేష్ శర్మ, గురుస్వామి మిట్టపల్లి మురళీధర్, కాంగ్రెస్ నాయకులు ముత్యాల రవీందర్, జైపాల్ రెడ్డి, నగునూరి అశోక్, కందునూరి ప్రకాష్, ఉస్తేం గణేష్, అమిరిశెట్టి తిరుపతి, కుమార్ కిషోర్, తిరుపతిరావు, ఎల్లె రాజు, శెట్టి శీను తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు పట్టణంలో ఘనంగా దీక్షా దివస్



**ఆమనగల్లు, నవంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు పట్టణంలో దీక్షా దివస్ పురస్కరించుకొని తెలంగాణ జాతిపిత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి మండల పార్టీ అధ్యక్షుడు అర్జున్ రావు, పార్టీ శ్రేణులతో కలిసి గిరిజన సంఘాల రాష్ట్ర నాయకుడు, పార్టీ అధ్యక్షుడు డాక్టర్ పత్యానాయక్ పాలాభిషేకం నిర్వహించారు.కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో "కేసీఆర్ సచ్చుడో ం తెలంగాణ వచ్చుడు" అనే నినాదంతో సకల జనులను ఏకం చేసిన దినంగా నవంబర్ 29ను దీక్షా దివస్‌గా గుర్తుచేసుకున్నారు. ఆ నిరాహార దీక్ష ద్వారా విద్యార్థి, ఉద్యోగ సంఘాలను ఏకం చేసి తెలంగాణ సాధించారని డాక్టర్ పత్యానాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చుక్క నిరంజన్ గౌడ్, సీనియర్ నాయకుడు ఖలీల్ భాయ్, మాజీ ఎంపీటీసీ సరిత పంతులు నాయక్, మాజీ సర్పంచ్ సోనా శీను నాయక్, మాజీ ఉప సర్పంచ్ జన్య నాయక్, రమేష్ నాయక్, రూప్ సింగ్ నాయక్, యూత్ వింగ్ అధ్యక్షుడు వద్దే వెంకటేష్, పరమేష్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్ నాయక్, ఎస్సి సెల్ అధ్యక్షుడు లండం యాదయ్య, కొమ్ము ప్రసాద్, నాగిళ్ళ జగన్, కృష్ణవేణి నాయక్, మల్యా నాయక్, మల్లేష్ నాయక్, మహేష్ నేత, శ్రీకాంత్ నాయక్, దేవేందర్, రంజిత్, శివ, మణిపాల్ నాయక్, హుమ్లా నాయక్, గణేష్ నాయక్, మల్లేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాపూర్ అభివృద్ధి పట్ల సంకల్పం



**వెల్దండ, నవంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
పెద్దాపూర్ గ్రామ ప్రజల కోరిక మేరకు, వారి ఆశీర్వాదంతో యాక్సిడెంట్ అనంతరం క్షేమంగా తిరిగి వస్తున్న సర్పంచ్ అభ్యర్థి పోలె సునీత శ్రీనివాస్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.ఆమె మాట్లాడుతూ, "నా పెద్దాపూర్ కుటుంబ సభ్యులందరికీ నమస్కారాలు. మీ అందరి ఆశీర్వాదాలు, మా అత్తమామ పోలె సత్యమ్మ -సంజయ్య దీవెనలు, నా భర్త దేశానికి చేసిన సేవల స్ఫూర్తి నాకు మార్గదర్శకాలు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా మన ఊరి అభివృద్ధికై సేవ చేయాలనే దృఢ సంకల్పంతో, భగవంతుడిచ్చిన ధైర్యంతో మీ ముందుకు వస్తున్నాను. నాకు చికిత్స అందించిన వైద్యుల ప్రోత్సాహం, సూచనలతో త్వరలోనే ప్రతి ఇంటికి నడుచుకుంటూ వచ్చి మీ ఆశీర్వాదం తీసుకుంటాను. విజయం దిశగా నిండు మనసుతో మీరు ఆశీర్వదిస్తారని కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఆమె తనను ఆశీర్వదించి, పెద్దాపూర్ గ్రామాభివృద్ధి యాత్రలో తోడ్పడాలని గ్రామ ప్రజలను కోరారు.

## రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని ఎంపీ రఘువీర్ రెడ్డి కి వినతి



**నల్లగొండ,నవంబర్ 29 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించాలని నలగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డికి జిల్లా రేషన్ డీలర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా17200 మందికి పైగా రేషన్ డీలర్లు పనిచేస్తున్నారని ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను రేషన్ కార్డు దారులకు పంపిణీ చేస్తూ ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్నామని, గోదాముల నుండి రేషన్ షాపులకు వచ్చే సరుకులు సరైన తూ కాలు లేకుండా ఇవ్వడం వల్ల రేషన్ డీలర్లు ఆర్థికంగా నష్టపోతున్నారని ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం వచ్చే సరుకులకు హమాలీ ప్రభుత్వమే భరించాలని ఇప్పటికీ రేషన్ డీలరే భరిస్తున్నాడని, కాంగ్రెస్ మేనిఫెస్టో లో ప్రభుత్వంలో రేషన్ డీలర్లకు 5000 గౌరవ వేతనం ప్రతి కింటకు 3 వందల చొప్పున కమిషన్ ఇస్తామని ఇప్పటివరకు నెరవేర్చలేదని వాటిని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర కోశాధికారి, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు, కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, రాజా రమేష్, బొల్లా వేణుగోపాలరావు, సముద్రాల యాదయ్య పాల్గొన్నారు

## వెల్దండలో బిఆర్ఎస్ బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నామినేషన్



**వెల్దండ, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ బీజేపీ పార్టీల పొత్తుతో స్థానిక సంస్థ ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థిని ప్రకటించారు. బిఆర్ఎస్ పార్టీ తరఫున కానుగుల కన్యాకుమారి సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయడానికి రెండు పార్టీలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఉప సర్పంచ్ పదవి బీజేపీకి ఇవ్వాలని నిర్ణయించారు. ఈ నామినేషన్ ప్రతిపాదనలో వెల్దండ మాజీ ఉప సర్పంచ్ జంగిలి నిరంజన్, కానుగుల జోగయ్య, మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, యువ నాయకుడు ప్రసాదు ఆనంద్, బీజేపీ నాయకులు కల్వకుర్తి నియోజకవర్గ ఇంచార్జి యెన్నం శేఖర్ రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు కురుమిద్దె యాదగిరి, పిల్లి దేవేందర్ తదితరులు ఉన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థి కన్యాకుమారి కానుగుల జోగయ్య నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. అదేవిధంగా పిల్లి రాణి, పిల్లి దేవేందర్ కూడా సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ పత్రాలు సమర్పించారు.

## నేడు పెద్దపల్లి జిల్లా స్థాయి చదరంగం పోటీలు



**ఎలిగేడు, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పెద్దపల్లి జిల్లా స్థాయి అండర్ 15 చదరంగం పోటీలు ఆదివారం కీర్తిశేషులు మంతెన అరుణ స్మారకార్థం మంతెన సత్యనారాయణ ఆధ్వర్యంలో అమర్చంద్ కళ్యాణమండపం (రిక్రియేషన్ క్లబ్)లో నిర్వహించబడతాయని జిల్లా చదరంగ సమాఖ్య అధ్యక్షుడు గడ్డల శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 100 రూపాయల ఎంట్రీ ఫీజుతో ఉదయం 9 గంటలకు పేరు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోటీల్లో పాల్గొనే వారికి ఉచిత భోజనం అందించబడుతుందని, మొదట గెలిచిన 8 మందికి నగదు బహుమతులు ఇవ్వబడతాయని తెలిపారు. అదనంగా అండర్-9, అండర్ -11 విభాగాల క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు ఉంటాయని వివరించారు. పోటీలకు చెస్ బోర్డులు, పావులు వెంట తీసుకురావాలని ఆయన కోరారు. వివరాలకు 9515342207 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## నాలుగో వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి జంగిలి సునీత నామినేషన్




**వెల్దండ, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వెల్దండ మండల కేంద్రంలో నాలుగో వార్డు బిఆర్ఎస్ అభ్యర్థిగా జంగిలి సునీత, జంగిలి ఆనంద్ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా జంగిలి సునీత మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో బిఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులే తన విజయానికి బాటవేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నాలుగో వార్డులో విజయం సాధించినట్లయితే త్రాగునీరు, వీధి లైట్లు, సిసి రోడ్ల మరమ్మతులు వంటి పనులను చేపడతానని తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెల్దండ బిఆర్ఎస్ అభ్యర్థి కన్యాకుమారి, మాజీ సర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీ జ్యోతి నిరంజన్, మండల యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి, మాజీ సర్పంచ్ గుద్దేటి ప్రభాకర్, జంగిలి శ్రీనివాసులు, గోరేటి సంజీవ, జంగిలి రవి తదితరులు పాల్గొన్నారు.

## నల్లగొండలో వీల్‌చైర్ల పంపిణీ




**నల్లగొండ, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ సౌజన్యంతో, లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూ వాయిసెస్ ఆధ్వర్యంలో నల్లగొండలోని కవనెంట్ చర్చ్‌లో 22 వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు వీల్‌చైర్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ, ఈ సేవా కార్యక్రమానికి ఆహ్వానించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 320ఈ గవర్నర్ రేపాల మదన్మోహన్ మాట్లాడుతూ, గత సంవత్సరం ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 30 వీల్‌చైర్లు పంపిణీ చేయగా, ఈ ఏడాది 22 వీల్‌చైర్లు అందజేశామని, మరో రెండు మూడు నెలల్లో 40 వీల్‌చైర్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఇండియన్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు సాల్మన్, కార్యక్రమ నిర్వహణలో కృషి చేసిన లయన్స్ క్లబ్ శక్తి న్యూ వాయిసెస్ జోన్ చైర్పర్సన్ పసలపూడి ఝాన్సీరాణికి అభినందనలు తెలిపారు. అమెరికాలో ఉన్న సాల్మన్‌తో మాట్లాడి నిరుపేదలకు సహాయం అందించాలనే భావనతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.వి. ప్రసాద్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సతీష్ కుమార్ కోడె, పుట్ట వెంకన్న, బిషప్ సమర్పన్ కుమార్, సెక్రటరీ మాధవి, ట్రెజరర్ కరుణ, విజయ, తబిత, ప్రీతి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బంది కి శిక్షణ కార్యక్రమం




**దేవరకొండ నవంబర్ 29.(నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
నల్లగొండ జిల్లా డిండి మండల కేంద్రంలో శనివారం ఎంపిడివో కార్యాలయం లో ఎంపిడివో వెంకన్న ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రెండవ గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్పీలు శేఖర్, గొడుగు శ్రీనివాస్ , శిక్షణ తరగతులను ఉపాధ్యాయ ఉపాధ్యాయులకు వివరంగా వివరించారు. ఎంపీడీవో వెంకన్న మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచి, వార్డు మెంబర్లు కు సంబంధించిన కు సంబంధించిన ఎన్నికల్లో విజయవంతంగా తమ విధులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్న, ఎం ఆర్ సి సిబ్బంది సైదులు ,ఆర్ పి లు, శేఖర్, శ్రీనివాస్, వివిధ పాఠశాలల పి ఆర్ ఓ విధినిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

## రిజర్వేషన్ ఎంపికలో నిబంధనలు ఉల్లంఘనపై హైకోర్టులో పిటిషన్

**ఎలిగేడు, నవంబర్ 29(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని శివపల్లి, లాలపల్లి గ్రామాల్లో రిజర్వేషన్ ఎంపికలో అధికారులు నిబంధనలు పాటించలేదని ఆరోపిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 17 ప్రకారం రిజర్వేషన్ ఖరారు చేయాల్సి ఉండగా, అధికారులు ధమాషా పద్ధతిలో నిర్ణయాలు తీసుకున్నారని ఎలిగేడు మాజీ వైస్ ఎం ఎం పి, హైకోర్టు న్యాయవాది బుర్ర వీరస్వామి గౌడ్ ఈ నెల 27న రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ వేశారు. మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉండగా, 10 గ్రామాల్లో రిజర్వేషన్లు సక్రమంగా అమలు చేసినప్పటికీ, శివపల్లి, లాలపల్లి గ్రామాల్లో వరుసగా ఒకే రకమైన రిజర్వేషన్లు కేటాయించడం ద్వారా రొటేషన్ విధానాన్ని ఉల్లంఘించారని పిటిషన్‌లో పేర్కొన్నారు. శివపల్లి గ్రామంలో 2013 ఎన్నికల్లో జనరల్ కేటగిరీ, 2018లో జనరల్ మహిళా, ప్రస్తుత 2025 ఎన్నికల్లో కూడా జనరల్ మహిళా రిజర్వేషన్ కల్పించారని తెలిపారు. లాలపల్లి గ్రామంలో 2018లో జనరల్ మహిళా, 2025లో జనరల్ కేటగిరీ రిజర్వేషన్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. వరుసగా అవే రిజర్వేషన్లు కేటాయించడం వల్ల మిగతా వర్గాలకు అన్యాయం జరిగిందని పిటిషన్‌లో స్పష్టం చేశారు. రిజర్వేషన్లను రద్దు చేసి, చట్టబద్ధమైన రొటేషన్ విధానం ప్రకారం కొత్తగా రిజర్వేషన్లు ఖరారు చేయాలని హైకోర్టును కోరారు.

## పదవి విరమణ అనేది వయసుకు మాత్రమే ప్రజాసేవకు కాదు



**జీడిమెట్ల, నవంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జీడిమెట్ల డివిజన్ స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో కుత్బుల్లాపూర్ సర్కిల్ టాక్స్ ఇన్స్పెక్టర్ మెండు శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై మెండు శ్రీనివాస్ రెడ్డి -విజయలక్ష్మి దంపతులకు శు భాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాదాపు 40 సంవత్సరాలపాటు వివిధ హోదాల్లో ప్రజాసేవ అందించి టాక్స్ ఇన్స్పెక్టర్‌గా పదవీ విరమణ పొందిన శ్రీనివాస్ రెడ్డి వయసురీత్యా మాత్రమే పదవీ విరమణ పొందారని, ప్రజాసేవకు పదవీ విరమణ ఉండదని అన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ - గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహ, మల్లారెడ్డి, వివిధ విభాగాల అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలి కలెక్టర్ : ఇలా త్రిపాఠి



**నల్లగొండ,నవంబర్ 29( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తిప్పర్తి మండలంలో తిప్పర్తి ,మామిడాల, పజ్జూరు గ్రామ పంచాయతీలలో మొదటి విడత నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శనివారం పరిశీలించారు చేశారు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో బ్యాంకుఖాతా, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించని పక్షంలో నామినేషన్ల పరిశీలన సమయం వరకు సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు.

## ఖేలో ఇండియా ఆర్చరీలో తానిపర్తి చికిత విజయాలు



పథకాలతో చికిత

**ఎలిగేడు, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామానికి చెందిన వరల్డ్ యూత్ చాంపియన్ తానిపర్తి చికిత మరోసారి తన ఆర్చరీ ప్రతిభను చాటింది. ఈ నెల 26, 27, 28 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో చికిత వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్, టీమ్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. చికిత విజయాలతో తల్లిదండ్రులు, మండల ప్రజలు, సుల్తానాపూర్ గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఆమె మరిన్ని పథకాలను సాధించి దేశానికి గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

# సత్తయ్య మృతి బాధాకరం!

**-ఎమ్మెల్యే బాలు నాయక్.**



**దేవరకొండ నవంబర్ 29. (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
దేవరకొండ మండల పరిధిలోని తాటికోల్ గ్రామానికి చెందిన హనుమంతు సత్తయ్య మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు,శనివారం హనుమంతు సత్తయ్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని తాటికొల్ లో ఆయన స్వగృహానికి ఎమ్మెల్యే చేరుకొని ఆయన భౌతిక గాయానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు, అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ సత్తయ్య కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు.ఈకార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ ఎం ఏ సిరాజ్ ఖాన్, మాజీ జెడ్పిటిసి మారుపాక అరుణ సురేష్ గౌడ్, తిప్పర్తి రుప్మా రెడ్డి, హనుమంతు వెంకటేష్ గౌడ్, ఆవిరినేని గోపాలరావు, వైయస్ కరుణాకర్, చలమల విజయ్, జూలూరు రేణు గౌడ్, హనుమంతు సైదులు,జాజుల వెంకటయ్య, జూలూరు అంజి, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ మొదటి విడత నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి.**




**మర్రిగూడ నవంబర్ 29. (నీలగిరి ఎక్స్ ప్రెస్ ).**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కేంద్రంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మర్రిగూడ మండలం, సరంపేట, శివన్న గూడెం ,వట్టిపల్లి గ్రామాలలో పర్యటించి నామినేషన్ స్వీకరణ కేంద్రాలను తనిఖీ చేశారు. నామినేషన్ దాఖలు ప్రక్రియ, సిబ్బంది హాజరు, అభ్యర్థులకు కల్పిస్తున్న సేవలు, భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ప్రతి కేంద్రంలో క్రమశిక్షణ, నిబంధనలు కచ్చితంగా పాటించాలని,రిజర్వేషన్లను కల్పించిన వారికి కుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ,మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సహాయ డెస్క్ ఏర్పాటు,అభ్యర్థులు కరెంట్ బ్యాంకు ఖాతా సమర్పించాల్సి ఉంటుందని, అభ్యర్థులు సమర్పించే నగదును ఎలా స్వీకరిస్తున్నారని ? అలాగే వారికి రసీదు ఇస్తున్నారా? అని అడిగారు . డిజిటల్ గోడ గడియారం అమర్చుకోవాలని చెప్పారు. చెక్ లిస్టులను నామినేషన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# కుల వివక్షత పాటిస్తే కఠినచర్యలు తప్పవు




**ఎలిగేడు, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గ్రామాల్లో కుల వివక్షత పాటిస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ యాకన్న హెచ్చరించారు. ఎలిగేడు మండలంలోని లాలపల్లిలో శనివారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో సమానత్వం నెలకొనేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి ఆంజనేయులు, ఆర్ఐ జయలక్ష్మీ, జీపీవో అనిల్ కుమార్, ఏఎస్సై బాస్కర్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, అంబేడ్కర్ సొసైటీ అధ్యక్షులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ తొలి విడుత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ పూర్తి

**వరంగల్, నవంబర్ 29 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి వరంగల్ జిల్లాలో గ్రామపంచాయతీ తొలి విడత ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ శనివారంతో ముగిసింది. రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 8 ,198 నామినేషన్లను ,వార్డ్ మెంబర్లకు 41,502 నామినేషన్లు దాఖలు చేశారు. మొదటి దశలో 129 మండలాల్లోనీ 4, 236 గ్రామ సర్పంచులకు ,37,440 స్థానాలకు డిసెంబర్ 11న పోలింగ్ నిర్వహించబడుతుందని, అదే రోజున లెక్కింపు జరుగుతుందని ఎన్నికల అధికారి తెలిపారు.

# బీజేపీతోనే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యం

**-సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు ఓటేస్తే, గ్రామ పంచాయతీలకు నయా పైసా రాదు**
**-బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్**
**-వరంగల్ జిల్లా స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ మొండిచేయి**
**-బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్**





**వర్ధన్నపేట, నవంబర్ 29(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
గ్రామ పంచాయతీల్లో జరిగే ప్రతి అభివృద్ధి పనికి కేంద్రమే నిధులు ఇస్తోందనేది సత్యం. కాబట్టి బిజెపికి ఓటేస్తేనే గ్రామాలకు మరిన్ని నిధులు, మరింత అభివృద్ధి సాధ్యమని గంట రవికుమార్ అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గంలో చింత నెక్కొండ, కట్రియాల, కడరిగూడెం మరియు పలు గ్రామాల్లో సర్పంచ్, వార్డు మెంబర్లుగా నామినేషన్లు దాఖలు చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కౌన్సిల్ మెంబర్ గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి,బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి ముందు కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చడంలో విఫలమైందని జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మండి పడ్డారు. మహిళలకు 2500 రూపాయల పింఛన్లు, రైతు రుణమాఫీ, ఉచిత యూరియా సరఫరా వంటి కీలక వాగ్దానాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని మార్గనిర్దేశనం చేశారు.

**రైతుల సమస్యల నిర్లక్ష్యం**

పంట సాయం అందించడంలో జాప్యం, రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ వైఫల్యం మరియు పంటలకు మద్దతు ధర ( ఎం ఎస్ పి ) చట్టపరమైన హామీని ఇవ్వకపోవడం వంటివి గ్రామీణ ప్రాంతాల్లో రైతుల నుండి వ్యతిరేకతకు ప్రజలు స్థానిక ఎన్నికలతో బుద్ధి చెప్పే అవకాశం వచ్చిందని అన్నారు.

**బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్**

2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, కాంగ్రెస్ పార్టీ తమ "కామారెడ్డి డిక్లరేషన్"లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని వాగ్దానం చేసి బీసీలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీ వో 46 ప్రకారం, బీసీలకు కేవలం 17శాతం రిజర్వేషన్లు మాత్రమే కేటాయించారని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లాడి తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులు పట్టాపురం ఏకాంతం గౌడ్, జిల్లా కార్యదర్శి జడ సతీష్, అధికార ప్రతినిధి మహేందర్ రెడ్డి, పర్వతగిరి మండల అధ్యక్షులు భిక్షపతి యాదవ్, మండల నాయకులు కుడికల శ్రీధర్, దేవేందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి పింగిలి సంపత్ రెడ్డి, పింగిలి రాజేందర్ రెడ్డి,నాయకులు చిర్రా కిరణ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దీక్షా దివస్ చరిత్రలో సువర్ణ అధ్యాయం-నిరంజన్ రెడ్డి

**వనపర్తి, నవంబర్ 29:( నీలగిరి ఎక్స ప్రెస్):**
దీక్షా దివస్ సందర్భంగా జరిగిన సమావేశంలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, 2009లో కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష తెలంగాణ చరిత్రలో మరిచిపోలేని ఘట్టమని అన్నారు. ఆ దీక్ష తెలంగాణ సమాజాన్ని ఒక్కటిగా నిలబెట్టి ఉద్యమాన్ని ఉదృతం చేసిందని పేర్కొన్నారు.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ అహింసా మార్గంలో ఉద్యమాన్ని నడిపిన నాయకుడని, ప్రపంచ ఉద్యమ చరిత్రలో దీక్షా దివస్ ఒక సువర్ణ అధ్యాయంగా మిగిలిందని తెలిపారు. 16 ఏళ్ల క్రితం ప్రారంభమైన దీక్షే చివరకు తెలంగాణ రాష్ట్ర సాధనకు దారి తీసిందన్నారు.1952 ఎన్నికలు, 1956లో ఆంధ్ర -తెలంగాణ కలయిక, ముల్కీ నిబంధనల ఉల్లంఘన, 1969 విద్యార్థి ఉద్యమం, ఉమ్మడి పాలనలో జరిగిన అన్యాయాలు, పాలమూరు ప్రాంతం ఎదుర్కొన్న నష్టాల నేపథ్యం వివరించారు. తెలంగాణ సమస్యను కేంద్రం బలవంతంగా నిర్లక్ష్యం చేయడంతోనే ఉద్యమాలు ఉధృతమైనట్లు పేర్కొన్నారు.1996లో విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ రైతులపై జరిగిన కాల్పులను ఖండిస్తూ కేసీఆర్ పదవి త్యజించడం, 2000లో తెలంగాణ ఉద్యమాన్ని పునఃప్రారంభించడం, జయశంకర్ సిద్ధాంతాలతో TRS ఆవిర్భావం జరిగిన విషయాలు వివరించారు.2009లో ఉద్యోగ గర్జన, అనంతరం కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష ఉద్యమానికి మలుపుతిప్పిందని తెలిపారు. కేసీఆర్ దీక్షతో 36 రాజకీయ పార్టీల మద్దతు లభించిందని, అయినప్పటికీ కాంగ్రెస్ వాయిదాలు వేస్తూ మోసం చేసిందని ఆరోపించారు.2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రణాళికాబద్ధమైన పాలన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిందని అన్నారు. ప్రస్తుత పాలనలో ఇచ్చిన హామీలేవీ అమలు కాలేదని, బోనస్ బకాయిలు, ప్రాజెక్టుల నిలిపివేత, రైతుల సమస్యలు పెరిగిన విషయాలను ఎత్తిచూపారు.పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ప్రభుత్వమే నిలిపివేసిందని, దాన్ని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ చేసిన మార్పులు నమ్మకద్రోహమని అన్నారు.ప్రజలు కాంగ్రెస్ మోసాన్ని గ్రహించినందున రాబోయే ఎన్నికల్లో బలమైన ప్రజాభిప్రాయం వ్యక్తం చేస్తారని వ్యాఖ్యానించారు.




## రామచందర్ శరీర దానంతో సమాజానికి ఆదర్శంగా నిలిచాడు - పలుస శంకర్ గౌడ్

**వనపర్తి నవంబర్ 29( నీలగిరి ఎక్స ప్రస్):**
వనపర్తి బస్వానగడ్డకు చెందిన రైల్వే శాఖ రిటైర్డ్ ఉద్యోగి చీర్ల రాంచందర్ ఆనారోగ్యంతో మరణించగా, తన చివరి కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన శరీరాన్ని మెడికల్ కాలేజ్‌కు దానం చేశారు.రాంచందర్ ఇంటిని సందర్శించిన వనపర్తి సాహితీ కళా వేదిక అధ్యక్షుడు పలస శంకర్ గౌడ్, "అన్ని దానాలకన్నా శరీర దానం



అత్యంత మహత్తరం" అని పేర్కొంటూ కుటుంబ సభ్యులను అభినందించారు. రాంచందర్ కుటుంబం సమాజానికి నిజమైన ఆదర్శమన్నారు.ఈ సందర్భంగా ఎంఈఓ చంద్రశేఖర్, జిహెచ్ఎం గణేష్ కుమార్, గంధం నాగరాజు, బండారు శ్రీనివాస్, శ్రీధర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాస్ సినిమాపై ఆశలు పెట్టుకున్న నిధి



కమర్షియల్ సినిమాలంటే హీరోయిన్లకు నాలుగు సీన్లు.. నాలుగు పాటలుంటాయనుకుంటే పొరపాటే. ఇప్పుడొస్తున్న కమర్షియల్ మూవీస్ అంతకు మించి ఉంటున్నాయి  అందుకు లేటెస్ట్ ఎగ్జాంపుల్ నేను రాజాసాబ్‌లో చేసిన రోలే అంటున్నారు మాళవిక. ఈ మూవీ రిలీజ్ కోసం ఆమెతో పాటు నిధి అగర్వాల్ కూడా వెయిటింగ్‌లో ఉన్నారు. సిల్వర్ స్క్రీన్ మీద హిట్ అనే పదం విని చాలా ఏళ్లే అయింది నిధి అగర్వాల్‌కి. రీసెంట్‌గా వచ్చిన హరిహరవీరమల్లులో పంచమి కేరక్టర్ కలిసొస్తుందనే అనుకున్నారు నిధి. అందులో ఇంటర్వెల్‌లో సడన్ షేడ్ కూడా ప్లస్ అవుతుందనుకున్నారు. కానీ అనుకున్నదొకటి అయ్యిందొకటి. అందుకే ఇప్పుడు రాజాసాబ్ మీద ఆశలు పెంచుకుంటున్నారు. 2026 జనవరి స్టార్టింగ్‌లోనే పాజిటివ్ వైబ్ స్టార్ట్ కావాలని భగవంతుడిని కోరుకుంటున్నా అంటున్నారు నిధి. ఈ సినిమా గురించి మాళవిక రీసెంట్‌గా చాలా బజ్ క్రియేట్ చేశారు. కమర్షియల్ సినిమాల్లో ఆఫర్స్ అంటే నాలుగు సీన్లు, నాలుగు పాటలుంటాయని అనుకున్నారట మాళవిక. కానీ ది రాజాసాబ్‌లో తన రోల్ విన్నాక టాలీవుడ్ ఎంట్రీకి పర్ఫెక్ట్ సినిమా ఇదేననిపించిందట. మా డార్లింగ్ సినిమా మీద మీరు పెట్టుకున్న హోప్స్ తప్పక నెరవేరాలండీ అంటూ మాళవికను విష్ చేస్తున్నారు రెబల్ ఫ్యాన్స్.




# ధనుష్ కొత్త సినిమాకు పాజిటివ్ టాక్..

## మొదటిరోజే రూ.16 కోట్ల కలెక్షన్స్

కోలీవుడ్ స్టార్ ధనుష్, బాలీవుడ్ హీరోయిన్ కృతి సనన్ జంటగా నటించిన రొమాంటిక్ డ్రామా 'తేరే ఇష్క్ మే' సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన ఓపెనింగ్స్ సాధించింది. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం హిందీతో పాటు తమిళంలో పాజిటివ్ టాక్ సాధించడంతో పాటు మొదటిరోజే దాదాపు రూ. 16 కోట్ల వసూళ్లను రాబట్టింది. దీంతో ధనుష్ బాలీవుడ్ కెరీర్‌లోనే ఇది అతిపెద్ద ఓపెనింగ్ కావడం విశేషం. మరోవైపు ఈ ఏడాది విడుదలైన చిత్రాలలో సైయారా తర్వాత రెండో అతిపెద్ద ఓపెనింగ్‌ను నమోదు చేసిన చిత్రంగా 'తేరే ఇష్క్ మే' రికార్డు నెలకొల్పింది. ఈ సినిమాకు ఆనంద్ ఎల్ రాయ్ దర్శకత్వం వహించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు. ఆనంద్ ఎల్ రాయ్, ధనుష్ కాంబినేషన్‌లో 'రాంఝణా' , 'అత్రంగి రే'  తర్వాత మూడో చిత్రంగా ఈ సినిమా తెరకెక్కింది.

# టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారిన భాగ్యశ్రీ బొర్సే ..

## సినిమాల కంటే పెళ్లి రూమర్లే ఎక్కువ!




టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరోయిన్ భాగ్యశ్రీ బొర్సే ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశం అవుతోంది. ఇప్పటివరకు నాలుగు సినిమాలు చేసిన ఆమెకీ అన్ని ఫ్లాప్స్ వచ్చినప్పటికీ క్రేజ్ మాత్రం ఆకాశాన్నంటుతోంది. అందం, స్టైల్, యాక్టింగ్‌తో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న భాగ్యశ్రీ తాజాగా తన కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకుని మళ్లీ స్పాట్‌లైట్‌లోకి వచ్చారు. మోడల్‌గా కెరీర్ ప్రారంభించిన భాగ్యశ్రీ మొదట బాలీవుడ్‌లో అడుగుపెట్టారు.తెలుగు ప్రేక్షకులకు ఆమెను పరిచయం చేసిన చిత్రం మిస్టర్ బచ్చన్. తొలి మూవీనే ఫ్లాప్ అయినా, ఆమె లుక్స్‌కు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది.తర్వాత వచ్చిన కింగ్‌డమ్ కూడా నిరాశపరిచింది. తర్వాత దుల్కర్ సల్మాన్ హీరోగా వచ్చిన కాంతలో నటించిన ఆమె, లుక్స్‌కు మంచి ప్రశంసలు అందుకున్నా ఆ సినిమా కూడా బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకోలేదు. అయితే మొదటి నుండి బాగానే కష్టపడిన సక్సెస్ రాలేదు. ఎట్టకేలకి ఇప్పుడు భాగ్యశ్రీకి మొదటి సక్సెస్ దక్కింది. రామ్ పోతినేని హీరోగా వచ్చిన ఆంధ్రా కింగ్లో ఆమె మహాలక్ష్మి పాత్రలో నటించి ప్రేక్షకులను మెప్పించింది. రెట్రో లుక్‌లో అచ్చం తెలుగమ్మాయిలా కనిపించిన భాగ్యశ్రీపై ప్రశంసలు వెల్లువెత్తాయి. కాగా, రామ్‌తో ఆమె కెమిస్ట్రీ కూడా సినిమాకి పాజిటివ్‌గా మారింది.ఇదిలా ఉండగా, సోషల్ మీడియాలో భాగ్యశ్రీ పెళ్లి గురించి అకస్మాత్తుగా చర్చ మొదలైంది. రామ్‌తో ఆమె రిలేషన్‌లో ఉన్నారన్న రూమర్స్ కొంతకాలంగా నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.ఈ క్రమంలో ఆంధ్రా కింగ్ ప్రమోషన్స్‌లో రామ్, భాగ్యశ్రీ స్పందించారు. మేము కేవలం మంచి స్నేహితులు మాత్రమే అని స్పష్టంగా చెప్పినా రూమర్లు మాత్రం ఆగలేదు. అయితే కొందరు నెటిజన్స్ "ఇప్పుడే పెళ్లి ఎందుకు?" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడే కెరీర్ సెట్ అవుతున్న సమయంలో పెళ్లి చేస్తే ఇబ్బందులు రావచ్చు అని అంటున్నారు. అనవసర చర్చలు ఆపండి అని సోషల్ మీడియాలో కామెంట్స్ పెడుతున్నారు. మొత్తం మీద అనేక రూమర్స్ నడుమ భాగ్యశ్రీ బొర్సే ప్రస్తుతం కెరీర్‌పై ఫోకస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆమె పెళ్లి గురించి వస్తున్న చర్చలు, రూమర్లు వాస్తవానికి దూరంగా ఉన్నాయని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి.



## ప్రభాస్ 'స్పిరిట్'లో కాజోల్ దేవగణ్.?

పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న హై-వోల్టేజ్ యాక్షన్ డ్రామా 'స్పిరిట్'. ఈ చిత్రం మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదుగా ఇటీవల పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుపుకుటుండగా.. ఈ ప్రాజెక్ట్ గురించి ఇండస్ట్రీలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం జోరుగా వినిపిస్తోంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ సీనియర్ స్టార్ హీరోయిన్ కాజోల్ దేవగణ్ కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తుంది. 'స్పిరిట్' చిత్రంలో మొదట హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ నటి కరీనా కపూర్ పేరు వినిపించినప్పటికీ, ఆమె ఆ రూమర్‌లను ఖండించారు. ఇప్పటికే ఈ చిత్రంలో హీరోయిన్‌గా త్రిప్తి దిమ్రీ ఎంపికయ్యారు. తాజాగా అందిన సమాచారం ప్రకారం, 'స్పిరిట్'లో ఒక శక్తివంతమైన పాత్ర కోసం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా బాలీవుడ్ నటి కాజోల్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. కాజోల్‌కి కూడా స్క్రిప్ట్ బాగా నచ్చిందని ఆమె ఈ ప్రాజెక్ట్‌లో భాగమవడానికి పాజిటివ్‌గా స్పందించినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.ఈ వార్త నిజమైతే, 'స్పిరిట్' కాజోల్‌కు మొదటి తెలుగు సినిమా కానుంది. ఆమె ఇంతకుముందు కొన్ని తమిళ చిత్రాలలో నటించినప్పటికీ, తెలుగులో ఇప్పటివరకు నటించలేదు. కాజోల్ లాంటి నటి 'స్పిరిట్' టీంలో చేరితే, ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు మరింత బలం, క్రేజ్ వస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ వార్తపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



# ఆ సంఘటన కలచివేసింది

హీరోయిన్‌గా ఎదిగే క్రమంలో ఎన్నో అవమానాలను, అవహేళనలను ఎదుర్కొన్నారట నటి మృణాల్ ఠాకూర్. ఇవన్నీ తనను మానసికంగా బలవంతురాలిని చేశాయంటున్నారామె. ఇటీవలే మృణాల్ లగ్జరీ మెర్సిడెస్ బెంజ్ కారును కొన్నారు. ఈ సందర్భంగా ఆనందం వెలిబుచ్చుతూనే తన జీవితంలో ఎదురైన మరిచిపోలేని అవమానాన్ని కూడా గుర్తు చేసుకుందీ భామ. 'నేను చాలా పేద కుటుంబంలో పుట్టాను. నన్ను పెంచేందుకు అమ్మ చాలా కష్టపడింది. ఇంట్లో డబ్బులు ఉండేవి కావు. అలాంటి రోజుల్లో బంధువులే మమ్మల్ని చిన్నచూపు చూసేవారు.మా అమ్మను కారు కూడా ఎక్కనిచ్చేవారు కాదు. కారెక్కే అర్హతే మా అమ్మకు లేదన్నట్టు అవమానించారు. ఓ సందర్భంలో మా అమ్మను ఒంటరిగా వదిలేసి కారులో వెళ్లిపోయారట. ఆ సంఘటన నన్ను కలచివేసింది. అప్పుడే డబ్బు సంపాదించాలి. ఖరీదైన కారులో అమ్మను తిప్పాలని డిసైడ్ అయ్యాను. ఆ కల నేటికి తీరింది. మా బంధువుల్లో ఎవరికీ లేని బెంజ్‌కారును కొన్నాను' అని చెప్పుకొచ్చారు మృణాల్ ఠాకూర్. ప్రస్తుతం ఈ భామ అల్లు అర్జున్-అట్లీ చిత్రంలో నటిస్తున్నది.